ప్రజాశక్తి

ఆదివారం 14 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ప్రభుత్వ పాఠశాలలా.. మజాకా..

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన భీమిలిలోని ఎపి బాలికల గురుకుల పాఠశాల

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు
- విశాఖలో 570 మార్కులు పైబడి సాధించిన పలువురు విద్యార్థులు
- సత్తా చాటిన భీమిలి స్టూడెంట్స్
- అందరూ పేదింటి పిల్లలే..

ప్రజాశక్తి - భీమునిపట్నం (విశాఖపట్నం)

టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాసిన వారిలో 570 మార్కులు పైబడి సాధించిన వారు 63 మంది ఉన్నారు. ఇదేమీ చిన్న విషయం కాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం వెల్లడించిన విషయం తెలిసిందే. అరకొర సిబ్బందితో ఈ మేరకు ఫలితాలు సాధించడం ఒక విధంగా గొప్ప విషయమనే చెప్పాలి. ఈసారి జిల్లాలో భీమునిపట్నం మండలానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు.

కేవలం ఇద్దరు సబ్జెక్ట్ టీచర్లు (ఇంగ్లీష్, హిందీ), 14 మంది గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్న ఎపి బాలికల గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 81 మంది విద్యార్థులకుగాను అందరూ పాసయ్యారు. ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్, ఇంగ్లీష్, హిందీ ఉపాధ్యాయులు, పిఇటి మాత్రమే పర్మినెంట్ సిబ్బంది. ఇటువంటి పరిస్థితుల్లోనూ పటిష్ట ప్రణాళిక, ఉన్న ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన ఫలితాలు సాధ్యమయ్యాయి. ఇక్కడ చదివేవారంతా పూర్తిగా గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద విద్యార్థులే. వారిలో జామి కల్పన 591 మార్కులు, ఎం.తేజశ్రీ 588, ఎస్.సౌజన్య, కె.నిహారిక, కె.సాయి 586 మార్కులు చొప్పున సాధించారు. 575 మార్కులు పైబడి 9 మంది, 570 పైబడి 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తెలుగు సబ్జెక్ట్‌లో నూటికి నూరు మార్కులు 30 మంది సాధించగా, గణితంలో 12 మంది, సోషల్‌లో ఆరుగురు, సైన్స్‌లో ఒకరు నూటికి నూరు శాతం మార్కులు పొందారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులంతా మట్టిలో మాణిక్యాలే. పుట్టి పెరిగింది గ్రామీణ ప్రాంతం. వ్యవసాయ మిగతా 2లో..

సమిష్టి కృషితోనే ఫలితాలు

సమిష్టి కృషితోనే మా పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించగలిగారు. ఎపి యాప్ (ఆల్‌పాస్, యాక్షన్ ప్లాన్) ప్రకారం విద్యార్థులకు తరచూ వివిధ పరీక్షలు నిర్వహించాం. 45 రోజుల యాక్షన్ ప్లాన్ ముందుంచుకుని ఆ దిశగా ప్రణాళిక ప్రకారం విద్యార్థినులకు సిలబస్ పూర్తి చేశాం. వెనుకబడిన విద్యార్థినులను దత్తత తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించాం. డిసెంబర్ నాటికే సిలబస్ పూర్తి చేశాం. సాధారణ పరీక్షలకు ముందే ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాం. దీంతో మంచి ఫలితాలు వచ్చాయి.

కోడి రాంబాబు, ప్రిన్సిపాల్, ఎపి బాలికల గురుకుల పాఠశాల, భీమునిపట్నం

హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

ఘనంగా టేబుల్ టెన్నిస్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, ప్లే ఫిట్ టీం ఆధ్వర్యంలో తలపెట్టిన ప్లేట్ టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ - 2023 పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఈశ్వర్ షిప్పింగ్ చైర్మన్ బి.హనుమంతరావు, ఒడిశా స్టీవ్‌డోర్స్ వైస్ ప్రెసిడెంట్ జెకె.నాయక్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ప్రధాన కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ కెవి.మురళీమోహన్ పాత్రో, ఎస్ఎంఎస్ డెంటల్ ఛైర్మన్ డాక్టర్ బి.శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొననున్నారు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు శైలు నూరుబాషా, విజి.సంయుక్తలతో పాటు పలువురు క్రీడాకారులు ఈ పోటీలకు రానున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ రిఫ్రీస్ రవికుమార్, దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

772వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

వార్త 2లో..

రెజ్లర్ల పోరాటానికి ప్రజా సంఘాల మద్దతు

వార్త 2లో..

రాజకీయ సమీకరణాలపై అంతర్మథనం

వార్త 8లో..

రుషికొండ బీచ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

రుషికొండకు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్

రాష్ట్రంలో ప్రత్యేక తీర ప్రాంతంగా గుర్తింపు

వార్త మెయిన్‌లో..

సమస్యలు పరిష్కరించాలి

ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచుల సదస్సులో ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - అనకాపల్లి

స్థానిక ప్రజాప్రతినిధుల సమస్యలను పరిష్కరించాలని, సర్పంచులకు, ఎంపిటిసిలకు రూ.15 వేలు, ఎంపిపిలకు, జెడ్‌పిటిసిలకు రూ.30 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి.రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలో శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచుల సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన సర్పంచుల నిధులు రూ.8 వేలా 660 కోట్లను వెంటనే తిరిగి ఇవ్వాలని కోరారు. గ్రామానికి సేవ చేద్దామని ఎన్నో ఆశలతో, ఆశయాలతో రెండు సంవత్సరాల క్రితం ఎన్నికై వచ్చిన సర్పంచులు పలు ఇబ్బందులు పడుతున్నారని

సమస్యలపై పోరాడుతున్న సర్పంచ్‌లను అభినందిస్తున్న రాజేంద్రప్రసాద్

తెలిపారు. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా సర్పంచులకు రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు, విధులు, అధికారాలను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సమస్యలు పరిష్కరించాలి

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా దారి మళ్లించడం దారుణమన్నారు. ఆ నిధులను తన సొంత అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకోవడంతో గ్రామాలు నిర్వీర్యమైపోతున్నాయని మండిపడ్డారు. కొత్తగా కేంద్రం నుంచి రావాల్సిన రూ.2 వేల 20 కోట్లు రాష్ట్రానికి వచ్చాయా ? ఒకవేళ వస్తే గతంలో రూ.8660 కోట్లను దారి మళ్లించినట్లే ఈ డబ్బులను కూడా దారి మళ్లించి సొంత అవసరాలకు వాడుకున్నారా ? అన్న విషయాన్ని చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు చింతకాయల సుజాత ముత్యాలు, దాడి ఎరుక నాయుడు, బిర్రు ప్రతాపరెడ్డి, బొర్రా నాగరాజు, సన్యాసినాయుడు, ఆనెపు రామకృష్ణ నాయుడు, సుబ్బరామయ్య, చుక్కా ధనుంజయ యాదవ్, చాపల మసేను, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలా.. మజాకా..!

కుటుంబం నుంచి వచ్చిన వారే అధికం. ఓ వైపు పేదరికం, మరో వైపు పుట్టెడు కష్టాలు.. వీటికి తోడు ఉపాధ్యాయుల కొరత, ఇన్ని సమస్యలున్నా వారు సత్తా చాటారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇలా..

చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, భీమిలి మండలం లక్ష్మీ పురం జెడ్పి హైస్కూల్లో కూడా టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ఇదే పాఠశాల నుంచి 126 మంది విద్యార్థులకుగాను 104 మంది అత్యుత్తమ ఫలితాలు సాధించారు. బోర త్రిలోక్ 585 మార్కులు, కెవివి కార్తీక్ 579 మార్కులు సాధించగా, 15 మంది 500కి పైబడి మార్కులు సాధించారు. భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పి హై స్కూల్లో 88 మందికిగాను 69 మంది ఉత్తీర్ణత సాధించారు. కళ్ళ జ్ఞానేశ్వరి 582 మార్కులు, బోని కావ్య 571 మార్కులు సాధించారు.

మరికొన్ని పాఠశాలల్లో..

ఎంజెపిఎపి, బిసి, సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించారు. సిహెచ్.భవిత 583, కె.హారిక 581, బి.వనిత 579 మార్కులు సాధించారు. కెజిబివిలో కె.యామ్నవి 575 మార్కులు సాధించింది. స్థానిక కెజిబివిలో 100 శాతం ఉత్తీర్ణతా శాతం నమోదైంది. 36 మందికిగాను 36 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ ఏడుగురు సబ్జెక్ట్ టీచర్లు ఉండగా వీరంతా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు

నిరంతర సాధన వల్లే

నిరంతర సాధన వల్లే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదల వంటివి ఫలితాల వెనుక ఉన్న రహస్యం. నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేశాం.

పొట్నూరు మురళీ మోహనరావు,
హెచ్ఎం, జెడ్పి హైస్కూల్, చిట్టివలస

స్టడీ అవర్స్ ఉపయోగపడ్డాయి

రోజుకో 4 గంటలపాటు నిర్వహించిన స్టడీ అవర్స్ బాగా ఉపయోగ పడ్డాయి. సబ్జెక్ట్ టీచర్లు బాగా పాఠాలు చెప్పారు. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేశారు.

జామి కల్పన (591 మార్కులు),
ఎపి బాలికల గురుకుల పాఠశాల, భీమునిపట్నం

అందరి ప్రోత్సాహంతోనే మంచి మార్కులు

ఏ సబ్జెక్ట్‌లో ఏది అవసరమో అదే అంశాన్ని ఉపాధ్యాయులు చెప్పేవారు. ఉపాధ్యాయుల సూచనల మేరకు చదివాను. అందరి ప్రోత్సాహంతో మెరుగైన ఫలితాలు సాధించాను.

బోర త్రిలోక్ (585), జెడ్పి హైస్కూల్, చిట్టివలస

772వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 772వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఎఫ్‌టియుఐకి చెందిన సంప్రదాయ మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి కె.లక్ష్మి మాట్లాడారు. దీక్షల్లో ఎం.లక్ష్మి, సిహెచ్.దుర్గ, ఎర్రయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిపాజిట్ స్కీం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేకంగా 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తుల కోసం కేరింగ్ డిపాజిట్‌తో పాటు జీవిత భీమా స్కీం 'సెంట్ సురక్షిత్ సమృద్ధి'ని ప్రవేశపెట్టినట్లు ఆ బ్యాంకు విశాఖ జిల్లా అధికారులు తెలియజేశారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కనిష్ఠ ప్రధాన వాయిదా మొత్తం రూ.10 వేలు, గరిష్ఠ ప్రిన్సిపల్ వాయిదా మొత్తం రూ.లక్ష ప్రీమియం డిపాజిటర్ జీవిత బీమా కవరేజీని బ్యాంక్ భరిస్తుందని పేర్కొన్నారు. స్కీం 84 నెలల డిపాజిట్ వ్యవధి కలిగి ఉంటుందని, ప్రిన్సిపల్ ఇన్‌స్టాల్‌మెంట్ మొత్తానికి 100 రెట్లు మెచ్యూరిటీ ఉంటుందని వెల్లడించారు. రెగ్యులర్ ఖాతాలకు బీమా ప్రీమియం బ్యాంక్ భరిస్తుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని తమ బ్రాంచిలను సంప్రదించాలని కోరారు.

రాజకీయ సమీకరణాలపై అంతర్మథనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రధాన రాజకీయ పార్టీల్లో సార్వత్రిక ఎన్నికల ఫీవర్ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఫ్లెక్సీలు, సీట్లు, టికెట్లపై సర్వత్రా చర్చ నడుస్తోంది. 2024 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రజల్లో గ్రాఫ్ ఎలా ఉంటుందన్న ఊహాగానాల్లో నేతలు తేలియాడుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖకు గడచిన 15 రోజుల్లో రెండు దఫాలుగా రావడంతో ప్రధాన పార్టీల్లో రాజకీయ కాక నెలకొంది. ఈ వారంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును ఆ పార్టీకి చెందిన విశాఖ నగర ఎమ్మెల్యేలు (గంటా మినహా) గణబాబు, వెలగపూడి, ఇతర నగర నాయకులు వెళ్లి కలిసొచ్చారు. వచ్చే ఎన్నికల్లో వ్యూహ, ప్రతివ్యూహాలు ఎలా ఉండబోతున్నాయన్న దానిపై ఇక్కడ ఆ పార్టీలో అంతర్మథనం నెలకొంది. ఎంఎల్‌సి ఎన్నికలతో టిడిపిలో విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతంలో కాస్త ఊపు కనిపిస్తోంది. టికెట్లు దక్కించుకుని బరిలో నిలబడేందుకు సైతం ఆశావహులు ఆ పార్టీలో ముందుకు రావడం విశేషం. జగన్ పర్యటనతో ఆద్యంతం ఆ పార్టీ విశాఖ నగరం, జిల్లా నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. పైగా తమ పార్టీకి ఇదివరకటి కన్నా ప్రజల్లో గ్రాఫ్ పెరిగిందని, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడమే దీనికి కారణమని వైసిపి శ్రేణులు చెబుతున్నాయి.

అభివృద్ధి కార్యక్రమాలపై ఆశలు

భోగాపురం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన, అదానీ డేటా సెంటర్‌కు భూమి పూజ, విశాఖ సాగర తీరంపై రూ.80 కోట్లకు పైగా ఖర్చుచేసి సుందరంగా తీర్చిదిద్దడం, పేదల సంక్షేమ పథకాల అమలు ఆగకుండా

కొనసాగించడం కలిసొచ్చే అంశంగా వైసిపి నేతలు భావిస్తున్నారు. వైఎస్ జగన్ రెండోదఫా విశాఖ నగరం వచ్చిన తరుణంలో పలు ప్రారంభోత్సవాలు కూడా చేపట్టారు. ఆ ప్రభావం కూడా ఉంటుందని వైసిపి నేతలు చెబుతున్నారు. పార్టీకి నష్టం చేస్తూ, వారి ప్రాంతాల్లో ప్రజల్లో ప్రతిష్ఠ పలుచబడ్డ మల్కాపురం ఏరియాకు చెందిన కార్పొరేటర్ పి.వి.సురేష్, మరో వైసిపి నాయకుడు దొడ్డి కిరణ్‌లను శనివారం వైసిపి అధిష్ఠానం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ చర్యలతో తప్పులు చేస్తే తాము యాక్షన్‌కు వెనుకాడబోమన్న సంకేతాలను వైసిపి నాయకత్వం కిందకు ఇచ్చినట్లు అయ్యింది. గతంలో కూడా కొయ్య ప్రసాద్‌రెడ్డి వంటి వారిని విశాఖ నగరంలో ఆ పార్టీ పక్కనపెట్టేసింది.

వైసిపిలో ప్రక్షాళన

2024 ఎన్నికల నేపథ్యంలో వైసిపిలో ప్రక్షాళన మొదలైనట్లు కనిపిస్తోంది. ముందస్తు ఎన్నికలు వచ్చేస్తాయంటూ ప్రతిపక్షాలకు చెందిన కొంతమంది నేతలు చెబుతున్నా ఆ అవకాశం లేదంటూ వైసిపి శ్రేణుల నుంచి వినిపిస్తోంది. విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, తెలుగుదేశం, జనసేన తమ రాజకీయ ఆధిపత్యం కోసం గట్టిగానే పోటీపడే అవకాశాలు ఈ దఫా కనిపిస్తున్నాయి. ప్రజల్లో కూడా రాజకీయ పార్టీల కదిలికలపై ఆసక్తి పెరుగుతోంది. ఎన్నికల్లోస్తే ఏ పార్టీ ఎవరితో కలువనుంది ? ఎవరికి నష్టం ? ఎవరికి లాభం ? 2024 ఎన్నికల బరిలో విజేత ఎవరన్న చర్చలు గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రారంభమయ్యాయి. వైసిపి, టిడిపికి చెందిన అగ్రనేతలంతా తమ తమ గ్రాఫ్‌లు నియోజకవర్గాల్లో ఎలా ఉన్నాయన్న దానిపై కసరత్తు ఆరంభించారు.

మహిళా రెజ్లర్ల పోరాటానికి ప్రజా సంఘాల మద్దతు

విశాఖలో బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఢిల్లీలో జరుగుతున్న మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా ఎపి మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ దిష్టిబొమ్మను శనివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ జంక్షన్‌లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.విమల మాట్లాడుతూ భారత దేశానికి అంతర్జాతీయ వేదికపై పతకాలు సాధించిపెట్టిన మహిళా రెజ్లర్లపై ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ప్రధానికి, క్రీడా రంగ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో వారంతా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొన్నిరోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారని తెలిపారు. వారికి న్యాయం చేయాల్సిందిపోయి ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నేతలు మహిళలపై లైంగిక దాడులకు, హత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఎఐఎస్ఎఫ్ నాయకులు యు.నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎ.భేగం, జయ, వనజాక్షిలతోపాటు మధు, సందీప్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న నాయకులు

ఎగుమతులపై ఆన్‌లైన్ కోర్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో ఎగుమతి వ్యాపారం - విధానం అంశంపై సర్టిఫికెట్ కోర్సును ఈ నెల 18 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఆన్‌లైన్‌లో ఈ కోర్సు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు రమ్యశ్రీని 9381893839 నెంబరులో సంప్రదించాలని కోరారు.

కామెడీ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉచిత కామెడీ వర్క్‌షాప్ పోస్టర్‌ను శనివారం ఉదయం ఎంవిపి.కాలనీలోని ఎస్‌విఎస్ డిగ్రీ కళాశాలలో బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నరవ ప్రకాశరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 19 వరకు కామెడీ అంశంపై మూడు రోజుల ఉచిత వర్క్ షాప్ ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30.వరకు జరుగుతుందని వెల్లడించారు.

జిఒ 1పై హైకోర్టు తీర్పు అభినందనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో రోడ్డు షోలు, సభలు, ర్యాలీలు, నిరసనలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ 1ని రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్‌లు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కార్మిక, ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తంచేయకుండా కార్మిక సంఘాలను, రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను నిరంకుశంగా అణిచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఒ నెంబరు 1కి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయన్నారు. అయినా ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడకుండా మరింత పటిష్టంగా జిఒను అమలు చేయాలని చూసిందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విశాఖ పర్యటన తరువాత ఈ జిఒను మరింత పటిష్టంగా అమలు చేయాలని పోలీసులకు సూచించారని వారు తెలిపారు.

ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనల పేరుతో ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. కేంద్ర, రాష్ట్ర విధానాలపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ఉద్యమాలను అణిచివేసేందుకు రాజ్యాంగ హక్కులకు తూట్లు పొడిచే విధంగా ఇటువంటి నిర్ణయాలు, జీవోలను ప్రభుత్వాలు తెస్తున్నాయని విమర్శించారు.

డాక్‌యార్డులో ఘనంగా నేషనల్ టెక్నాలజీ డే

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో శనివారం ఘనంగా 25వ నేషనల్ టెక్నాలజీ డే జరిగింది. ఈ నేపథ్యంలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఎన్‌డిటి)పై జరిగిన వర్క్‌షాప్‌ను డాక్ యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్, రియర్ అడ్మిరల్ సంజయ్ సాధు ప్రారంభించారు. ఎన్‌డిటి ఉపయోగంపైనా, నౌకల రిపేర్లు, నిర్మాణాలపైనా ప్రధానంగా ఈ వర్క్‌షాప్ జరిగింది. 350 మంది వివిధ నేవల్ యూనిట్లకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, దేశంలోని నాలుగు షిప్‌యార్డుల ఉద్యోగులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. కల్పకం, బార్క్ నుంచి సైంటిస్టులు హాజరయ్యారు. నౌకల రిపేర్లు, నిర్మాణాలపై ఆర్టిఫిషియల్ టెక్నాలజీ (ఎఐ) ఇతర రేడియోగ్రాఫిక్ టెస్టింగ్, గ్యాస్ టర్బైన్స్, బాయిలర్స్‌పైనా, ఎమర్జింగ్ టెక్నాలజీలపైనా సంజయ్ సాధు ప్రసంగించారు. యుద్ధనౌకల తయారీ, మరమ్మతులు, ఇతర విభాగాల్లో నిర్మాణాలపై పలు అంశాలను వివరించారు.

జిఒ 1పై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిఒ 1 రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని, ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చెంప పెట్టు అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రోడ్ల కూడళ్ళలో బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్డు షోలను కట్టడి చేస్తూ, ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో తీసుకొచ్చిన జిఒ నెంబర్ 1 రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉందని కోర్టు వ్యాఖ్యానించినట్లు వివరించారు. టిడిపి చేపట్టిన సభలు, సమావేశాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేస్తుండడంతో జీర్ణించుకోలేని అధికార వైసిపి ఉద్దేశ పూర్వకంగానే ఈ జిఒ తీసుకొచ్చిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు ఎం.సంజీవ్‌కుమార్, నరసింగరావు, వియ్యపు పోతురాజు, గండిబోయిన పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్ర

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు సంఘీభావంగా నియోజక వర్గంలో పాదయాత్ర చేయాలని కోరాడ రాజబాబు కోరారు. ఇందుకు సంబంధించి పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సంఘీభావ పాదయాత్రలో తెలుగు యువత ముందుండాలని సూచించారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కద లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పార్టీ భీమిలి మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, జివిఎంసి 1, 4, 5 వార్డుల అధ్యక్షులు టి.సూరిబాబు, పాసి నరసింగరావు, ఎన్.సత్యనారాయణ, పిట్టా సురేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎస్ అప్పారావు, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సింహాలకు ఆవాసం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానం కింద టిటిడి కల్యాన మండపం వసతి గదులకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. దేవస్థానం పరిపాలన విభాగం ఈవో కార్యాలయాలు తొలగించిన తరువాత టిటిడిలో వసతి గృహంలో దేవస్థానం కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యాలయంలో నిత్యమూ పదుల సంఖ్యలో కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానం అధికారులు వెంటనే స్పందించి కుక్కలు బెడద లేకుండా చేయాలని వారు కోరుతున్నారు.

ముత్తంశెట్టిపై ఛార్జిషీట్ వేయాలి : బిజెపి

ప్రజాశక్తి-పద్మనాభం : స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై ఛార్జిషీట్ వేయాలని బిజెపి మండల అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు శనివారం పద్మనాభం సిఐకి వినతి పత్రం అందించారు. ప్రజాప్రయోజనాలకు అవసరమైన పనులు చేపట్టక పోగా, అభివృద్ధి కార్యక్రమాలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. గోస్తనీ నది నుంచి ఇసుక అక్రమ రవాణా, రేవిడి పంచాయతీలో ఇరిగేషన్ కాలువకు కేటాయించిన భూమిని వైసిపి నాయకులు ఆక్రమించుకోవడం తదితర 17 సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంటుభుక్త రామానాయుడు, కృష్ణ, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో శత శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -పిఎం పాలెం : సిబిఎస్‌ఇ బోర్డు ప్రకటించిన పది, పన్నెండో తరగతి ఫలితాలలో కొమ్మాది నవోదయ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. పన్నెండో తరగతిలో 67 మంది విద్యార్థులు హాజరు కాగా 64 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. రొంగలి అలేఖ్య 476 మార్కులతో ప్రథమ స్థానం, 474 మార్కులతో డి.సాయివర్షిత ద్వితీయ స్థానాన్ని పొందినట్టు వివరించారు. పదో తరగతిలో 76 మంది విద్యార్థులు హాజరుకాగా 72 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. బి.పూజిత, బిడి.తేజస్విని 475 మార్కులతో ప్రథమ స్థానాన్ని, నవ్యగీతిక, దివ్యశ్రీలు 473 మార్కులతో ద్వితీయ స్థానాన్ని పొందినట్టు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించినందుకు విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రిన్సిపల్ అభినందించారు.

నవోదయ పదకొండో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయలో 2023-24 విద్యా సంవత్సరానికి పదకొండో తరగతిలో ప్రవేశానికి మొదటిసారిగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదవతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు 1-6-2006 జూన్ 1 నుంచి 2008 జులై 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. మే 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జులై 22వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష పదవతరగతి స్థాయిలో ఆంగ్లం, గణితం, సైన్సు, సోషల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ విభాగాలలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుందని వివరించారు. ఒఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి వివరాలు పొందవచ్చని పేర్కొన్నారు.

కల్యాణ మండపానికి స్థలం కేటాయించాలని వినతి

ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న కృష్ణమూర్తి పాత్రుడు

ప్రజాశక్తి -మధురవాడ : నగరాల కులస్తులకు కల్యాణమండపం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు వినతిపత్రం అందించారు. పిఎం.పాలెం క్రికెట్‌స్టేడియం వద్ద వైఎస్ఆర్ విగ్రహావిష్కరణకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రిని ఆయన కలిశారు. విశాఖపట్నం జిల్లా పరిధిలో నగరాలు కులస్తులు సుమారు రెండు లక్షల మంది ఉన్నారని, తమకు ఎక్కడా వివాహాది శుభకార్యాలు చేయుటకు కల్యాణ మండపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

'స్థానికులకే టికెట్ అనడం సరికాదు'

ప్రజాశక్తి-పద్మనాభం: 2024 ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గ టికెట్ స్థానికులకే కేటాయించాలని మాజీ ఎంపిపి డి.గోపీబాబు చేసిన వ్యాఖ్యలు సరికావని పలువులు వైసిపి నాయకులు అభిప్రాయపడ్డారు. వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు ఆధ్వర్యాన మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, గోపీబాబు సుమారు 4 సంవత్సరాలుగా పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. గోపిబాబు వ్యాఖ్యలను వైవి సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీనికి వైవి.సుబ్బారెడ్డి స్పందించి పార్టీ నుంచి గోపీబాబును తొలగించాలని మండల పార్టీ తీర్మానం చేసి, దీనిపై సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకుల సంతకాల చేసి తీసుకురావాలని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కంటుబోతు రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు సుంకర గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనశీలురు : విసి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు సృజనశీలురని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఏయూ చిత్రకళా విభాగంలో బిఎఫ్ఎ, ఎంఎఫ్ఎ విద్యార్థుల వార్షిక చిత్ర, శిల్పకళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన శిల్పాలు, వర్ణచిత్రాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. చిత్రం వెనుక ఉన్న ఆలోచనలను విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. క్లే, బ్రాస్, విభిన్న మాధ్యమాలతో తీర్చిదిద్దిన చిత్రాలు, శిల్పాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ, వర్సిటీ చిత్రకళ విభాగం విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులన్నారు. విశ్వవిద్యాలయాన్ని మరింత కళాత్మకంగా తీర్చిదిద్దడంలో వీరి ప్రతిభను ప్రోత్సహిస్తామన్నారు. ఈ ప్రదర్శనను వర్సిటీలోని విభిన్న విభాగాల విద్యార్థులు తిలకించేలా ప్రోత్సహిస్తామన్నారు. విద్యార్థులకు మానసిక ప్రశాంతత, ఒత్తిడి నుంచి ఉపశమనం అందించే విధంగా చిత్రలేఖనం నిలుస్తుందన్నారు. విద్యార్థులు ఎంతో ప్రతిభతో తీర్చిదిద్దిన కళారూపాలు అందరి మనసులను దోచుకుంటాయన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి సింహాచలం, ఆచార్య వి.రమేష్, విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న విసి ప్రసాదరెడ్డి

నేరాలు ఘోరాలు

భార్యను కడతేర్చిన భర్త

అనాథలుగా మారిన పిల్లలు

రాజ్యలక్ష్మి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చీడిక గ్రామంలో వివాహితను భర్త హత్య చేయడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ శిరీష అందించిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన చీడిపల్లి నాగేంద్ర వర్మకు, ఏలేశ్వరంకు చెందిన రాజ్యలక్ష్మితో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం నుండి భార్య రాజ్యలక్ష్మి వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు భర్త నాగేంద్ర వర్మ అనుమానించేవాడు. తరచు ఆమె ఫోన్లో మాట్లాడుతుండటంతో ఇద్దరి మధ్య పలు మార్లు ఘర్షణ పడేవారు. ఐదు లక్షల కట్నం సొమ్ము కూడా నాగేంద్ర వర్మ ఖర్చు చేశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు పడేవారు. భార్య రాజ్యలక్ష్మి తరచూ ఫోన్లో మాట్లాడడంతో శుక్రవారం సెల్ ఫోన్ తీసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి నాగేంద్ర వర్మ కోపంతో కత్తిపీట కర్రతో భార్య రాజ్యలక్ష్మి తలపై కొట్టడంతో ఆమె మృతి చెందింది. భర్త నాగేంద్ర వర్మ పోలీసులకు లొంగిపోయాడు. రాజ్యలక్ష్మి తల్లి అప్పలరాజు తన కూతురిని అల్లుడు హత్య చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ నారాయణరావు, ఎస్సై శిరీష, క్లూస్ టీం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శిరీష వెల్లడించారు.తల్లి చనిపోవడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.

ఏలేరు కాలువ గట్టున అప్పారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన తనకాల అప్పారావు (63) ఏలేరు కాలువలో శవం శనివారం తేలాడు. కశింకోట పోలీసుల కథనం ప్రకారం.... అప్పారావు తన ఇంటి నుంచి గురువారం ఉగ్గినపలెం గ్రామం లో వారి బంధువుల వివాహం నిమిత్తం వెళ్ళాడు. పెళ్లి అయిన తరువాత రోజు శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల ప్రాంతంలో బహిర్భూమి కోసం ఉగ్గినపాలెంలో ఉన్న ఏలూరు కాలువ దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తు జారీ కాలువలో పడిపోయారు. తండ్రి కనిపించకపోవడంతో శుక్రవారం తన కుమారుడైన తనకాల నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏలేరు కాలువలో శనివారం అప్పారావు మృతదేహం తేలింది. మృతదేహాన్ని అదనపు ఎస్ఐ నాగేశ్వరరావు పరిశీలించారు. ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు విరిగిపడి గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో తాటిచెట్టు విరిగిపడి గాయపడిన వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు స్థానిక సిఐ పి.రంగనాథం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన దొగ్గ శివరావు(42) ఈ నెల 4న పొలంలో పాక కట్టడానికి తాటి కమ్మలు మోపు కడుతుండగా ఎదురుగా ఉన్న ఎండిన తాటిచెట్టు గాలికి విరిగి ఆయనపై పడింది. తీవ్రంగా గాయపడిన శివరావును బంధువులు విశాఖ డెయిరీ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తుండగా, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు ఈ నెల 9న తరలించారు. శివరావుకు కేజీహెచ్‌లో వెంటిలేటర్‌పై అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సస్పెన్షన్‌తో పివి.సురేష్ గ్రూప్ డీలా

సస్పెన్షన్‌కు గురైన పివి.సురేష్ (ఫైల్)

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 60వ వార్డు వైసిపి కార్పొరేటర్ పివి.సురేష్‌ను పార్టీ అధిష్టానం సస్పెండ్ చేయడంతో ఆయన గ్రూపు ఖంగుతింది. కొద్దినెలలలో సార్వత్రిక ఎన్నికలు ఉన్న నేపథ్యంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచినట్లు సమాచారం. పార్టీకి నష్టం కల్గించే వారిని ఏరిపారేసే క్రమంలో భాగంగా పివి.సురేష్‌పై పార్టీ క్రమశిక్షణ విభాగం సిఫారసుల మేరకు వేటు పడింది.

గతంలో పివి.సురేష్ వైసిపిలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడంతో పాటు గత సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్‌పై దూషణల పర్వం చేపట్టాడనే ఆరోపణలతో అప్పట్లో ఆయనను పార్టీ సస్పెండ్ చేసింది. అనంతరం జనసేన పార్టీలో చేరిన సురేష్ అక్కడ ఇమడలేక తిరిగి జివిఎంసి ఎన్నికల ముందు మళ్లీ వైసిపిలో చేరారు. వైసిపి తరుపున 60వ వార్డు కార్పొరేటర్‌గా బరిలో దిగి ఎన్నికయ్యాడు. అతని వ్యవహార శైలిపై పార్టీ పెద్దలకు అనేక ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన కార్పొరేటర్ అయ్యాక దుందుడుకుతనాన్ని ప్రదర్శిస్తూ పార్టీకి నష్టం కల్గిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. వైసిపి బలోపేతానికి శ్రమించిన కార్యకర్తలను కాదని, ఇద్దరుముగ్గురిని వెనుకేసుకొని తిరగటం, వారు చెప్పిన మాటలు వింటూ మిగిలిన వారిని కించపరచడం, హెచ్‌పిసిఎల్, ఎల్ అండ్ టి, కోరమండల్ తదితర సంస్థలలో పార్టీకి సంబంధం లేని వారికి లబ్ధి చేకూర్చేలా చేయడం, సచివాలయంలోని కొంతమంది సిబ్బందిని, జివిఎంసిలోని కొంతమంది అధికారులను గుప్పెట్లో పెట్టుకొని వ్యక్తిగతంగా తనకు పడని వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఎప్పటి నుంచో సొంత పార్టీ వారే అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఇటీవల వార్డులోని చింత చెట్టు కింద స్కూల్ బ్యాగులు కుట్టుకుంటున్న దళితునిపై కక్షపూరితంగా వ్యవహరించడం, పార్టీ కార్యకర్తల్ని హీనంగా చూస్తుండడంపై నేతలు కూడా పివి.సురేష్‌పై గుర్రుగా ఉన్నారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తుండడంతో పాటు అధికారిక కార్యక్రమాలకు హాజరు కాకపోవడం, పోటీగా సొంత కార్యక్రమాలు నిర్వహించడంపైనా కార్యకర్తల్లోనూ అసంతృప్తి నెలకొంది. రానున్న ఎన్నికలలో పార్టీకి తీవ్ర నష్టం కలిగే అవకాశమున్నందున సురేష్ వ్యవహారాలపై పార్టీ అధిష్టానం దృష్టిసారించింది. ఫలితంగా కార్పొరేటర్ పివి.సురేష్‌పై వేటు పడింది.

సస్పెన్షన్‌పై పివి.సురేష్ గ్రూపు ఖంగుతింటే.. ఈ నిర్ణయం పట్ల బాధితులు కొంతమంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదెప్పుడో చేసి ఉండాల్సిందని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపనలో మేయర్ హరి వెంకటకుమారి

గాజువాక సమగ్రాభివృద్ధికి కృషి

మేయర్ హరి వెంకటకుమారి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. 72వ వార్డు పరిధి పాత గాజువాక కూడలిలో రూ.37.90 లక్షలతో నిర్మించనున్న నూతన బస్‌షెల్టర్‌కు స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, బస్ షెల్టర్ల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎస్ఇ, ఇఇ, ఎఇలతో పాటు వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సిరట్ల వాసు, సిపిఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, వెంకటేష్ గౌడ్ తదితరులు

చీరల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ పుట్టినరోజు సందర్భంగా ఉత్తరాంధ్ర సర్దార్ గౌతు లచ్చన్న గీతకులాల యువజన సంఘం నాయకులు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యాన ఉడాకాలనీలో చీరలు పంపిణీ చేశారు. తొలుత గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు. మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నెల్లి అప్పలరాజు, జెర్రిపోతుల గోవిందరావు, చుక్క ఈశ్వరరావు, ఒనం నాగేశ్వరరావు, చప్పిడి నాగరాజు, ఏకుల సూర్యప్రకాష్, జెర్రిపోతుల సురేష్‌రావు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హెచ్ఒడితో మాట్లాడుతున్న ఒబిసి నాయకులు

డాక్టర్ బదిలీ ఆపాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ జనరల్ హస్పిటల్ డెంటల్ డాక్టర్ సంతోష్ కాంబ్లీ బదిలీ ఆపాలని ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు హెచ్ఒడిని కలిసి బదిలీపై చర్చించారు. జెఎల్ఎంలో డెంటల్ క్లినిక్ అవసరం లేదని, సీనియర్ డాక్టర్ అయిన సంతోష్ కాంబ్లీని స్టీల్ జనరల్ ఆసుపత్రిలోనే ఉంచడం మంచిదని హెచ్ఒడికి అసోసియేషన్ సభ్యులు వివరించారు. జెఎల్ఎంలో డెంటల్ సర్జన్ కంటే జనరల్ డాక్టర్‌ను వేస్తే ఉపయోగముంటుందన్నారు. దీనిపై హెచ్ఒడి సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఒబిసి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు వైఎల్.నాయుడు, కోశాధికారి యు.శ్రీనివాసరావు, అదనపు ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.నారాయణ, డిప్యూటీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జిఆర్‌కె.నాయుడు, కొంతాల రామకృష్ణ, పి.గోవింద, ఆర్.సత్యనారాయణ, అచ్యుతరావు, వి.నర్సింగరావు, డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రెస్ అక్రిడిటేషన్ల జిఒను సవరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రెస్ అక్రిడిటేషన్ల జిఒ 38ను తక్షణమే సవరించాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్ఎ) డిమాండ్ చేసింది. నగరంలోని ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిఒలోని పలు అంశాలపై ప్రతినిధులు చర్చించారు. ఐటి రిటర్న్స్ జత చేయాలనే నిబంధనను తొలగించాలని, స్థానిక దినపత్రికలకు గతంలో మాదిరిగా ప్రచురణ కేంద్రంతోపాటు నియోజకవర్గాల వారీగా, ఇతర జిల్లాల్లోనూ ప్రెస్ అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిరియాడికల్స్‌కు కనీసంగా రెండు అక్రిడిటేషన్లు, స్టేట్ బస్సు పాస్ జారీ చేయాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు వచ్చే విధంగా జిఒను మార్పుచేయాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 300 చదరపు గజాల చొప్పున జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, స్థానిక పత్రికలకు తగినన్ని యాడ్స్ ఇవ్వాలని, ఉచితంగా హెల్త్ కార్డులు పంపిణీ, కోవిడ్‌తో మృతి చెందిన జర్నలిస్టులకు గతంలో విడుదల చేసిన జిఒ ప్రకారం రూ.5 లక్షల పరిహారం చెల్లింపు తదితర డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని సమావేశం తీర్మానించింది. స్థానిక పత్రికల నుంచి జిల్లా మీడియా అక్రిడిటేషన్ల కమిటీలో సభ్యునిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిట్టల శ్రీనివాస్‌ను ఈ సమావేశంలో ఘనంగా సన్మానించారు. అక్రిడిటేషన్ల సమస్య పరిష్కారానికి తగిన కృషి చేయాలని కోరారు. ఈ నెల 15న జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో అక్రిడిటేషన్ల సమస్యపై వినతి పత్రాలు అందజేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సర్వసభ్య సమావేశంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, కార్యదర్శి ధవలేశ్వరపు రవికుమార్, ఉపాధ్యక్షుడు బి.నారాయణరావు, కోశాధికారి అర్.అబ్బాస్, బి.రవికాంత్, హరనాథ్, కె.చక్రవర్తి, జి.ఆనంద్, బి.శివప్రసాద్, వెంకటవేణు, మహేష్, పితాని ప్రసాద్, నరేంద్ర, కుమార్, శ్రీహరి, కమల్‌కుమార్, కెకె.రెడ్డి, హేమసుందర్, భగవాన్, నరసింహం, రవికుమార్, గణేష్, కీర్తన, బి.ఎ.నాయుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

నిట్టల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎల్ఎన్ఎ సభ్యులు

కేసుల్లో రాజీ శ్రేష్ఠం

ప్రజాశక్తి-లీగల్ : కేసులు పరిష్కారంలో ఇరువర్గాలు రాజీ శ్రేష్ఠమైనదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. శనివారం జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో విశాఖ జిల్లాలో అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించారు. జాతీయ లోకదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 36 బెంచ్‌లను ఏర్పాటుచేసి కేసులు పరిష్కారానికి ముందుకు వచ్చే కక్షిదారులకు సరైన రీతిలో రాజీలు కుదిర్చి రాజపత్రాలను అందించామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎమ్మెస్ శేషమ్మ మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రాజీకి పరిష్కారమయ్యే 9839 కేసులను గుర్తించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కక్షిదారులు పెద్ద ఎత్తున హాజరవుతున్నందుకు అభినందనలు తెలియజేశారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 8657 కేసులు పరిష్కారమయ్యాయని, నష్టపరిహారం కింద రూ.13 కోట్లు కక్షిదారులకు ఇచ్చినట్లు తెలిపారు.

16న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : కంచరపాలెం ఓల్డ్ ఐటిఐలో ఈ నెల 16న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణచైతన్య, ఐటిఐ ప్రిన్సిపల్ డాక్టర్ జె.శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి 3 గంటల వరకు ప్రముఖ కంపెనీలలో 150 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఐటి కంపెనీ డబ్ల్యుఎన్ఎస్ పింఫోల్, యాక్ట్ ఫైబర్ నెట్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అర్హులైన నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటిఐ పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన వారికి అర్హతల ఆధారంగా రూ.10 వేలు నుంచి రూ.20వేల వరకు జీతభత్యాలుంటాయని పేర్కొన్నారు. విశాఖపట్నం, దువ్వాడ సెజ్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్నవారంతా హాజరు కావచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9292553352 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

16న డెంగీ నివారణ దినం

డెంగీ నివారణ కార్యక్రమాలపై సమీక్షలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఈ నెల16వ తేదీన జాతీయ డెంగీ నివారణ దినం పాటించడంతోపాటు, వ్యాధిపై అవగాహన సదస్సులు ఏర్పాటుచేసేందుకు శుక్రవారం, శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, డెంగీ నివారణకు అవగాహన సదస్సుల బాధ్యతలను సబ్ యూనిట్ అధికారులు, హెల్త్ అసిస్టెంట్లకు అప్పగించాలని డిఎంఒను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిడిఒలు, సర్పంచ్‌లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ, డెంగీ నియంత్రణకు పెరి డొమెస్టిక్ బ్రీడింగ్‌పై దృష్టి సారించాలన్నారు. డెంగీకి ముందస్తుగా చికిత్స ప్రారంభించడమే కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిలుపుదల చేసిన కార్మికులను

విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

రాంబిల్లి మండలం, నేవీ నిర్మాణ పనుల్లో ఎల్ అండ్ టి పి2 సబ్ కాంట్రాక్టరుగా ఉన్న ఎన్కె ఇండస్ట్రీయల్ సర్వీసెస్‌లో విధుల నుండి నిలుపుదల చేసిన 28 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నేవీ మెయిన్ గేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు మాట్లాడుతూ ఎన్కె ఇండస్ట్రీయల్ సర్వీసెస్‌లో గత మూడేళ్లగా పనిచేస్తున్న 28 మంది ఆపరేటర్లు, మెకానిక్స్, డ్రైవర్లను ఉన్నఫలంగా విధుల తొలగించడం అన్యాయమన్నారు. ఈ విషయంపై ఎల్ అండ్ టి పి2 యాజమాన్యం వెంటనే చొరవ తీసుకొని తిరిగి విధుల్లోకి తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని, సెంట్రల్ లేబర్ కమిషనర్, లేబర్ అధికారులు జోక్యం చేసుకుని 28 మంది కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్కె ఇండస్ట్రీయల్ సర్వీసెస్‌లో మూడేళ్ల నుండి కార్మికుల చేత రోజుకు 12 గంటల చొప్పున, ఎటువంటి సెలవుల్లేకుండా నెలలో 30 రోజులూ డ్యూటీ చేయించుకున్నారని, అందుకు ఓటి అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించలేదని, బోనస్ ఇవ్వలేదని, కనీస వేతనాలు అమలు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పుడు ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా ఏకంగా విధుల నుండి నిలుపుదల చేశారని, ఆ కార్మికులంతా ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్.నూకన్న, బాధిత కార్మికులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న తొలగించబడిన కార్మికులు

10, 12 తరగతుల్లో టాపర్లు అనుసుమన్ మహపాత్ర, సుజనశ్రీ

సిబిఎస్ఇలో 'డావెన్సీ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ స్కూలు విద్యార్థులు సిబిఎస్ఇ బోర్డు పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించారు. మార్చి నెలలో జరిగిన పది, 12వ తరగతి సిబిఎస్ఇ బోర్డు పరీక్షలలో పదవ తరగతి అన్ని సబ్జెక్టుల్లో అనుసుమన్ మహపాత్ర 96శాతంతో అత్యధిక మార్కులు సాధించారు. మళ్ల బాలాజీ నిహాల్ 95శాతం, బొడ్డు రామసాయి శ్యామ్ 93శాతం మార్కులు సాధించారు. 12వ తరగతి బైపిసి, ఎంపిసి, ఎంఇసిల్లో సుజనశ్రీ, మనోజ్ కృష్ణ, గీతిక అగ్రస్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డావెన్సీ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందర్, డైరెక్టర్ రమణాజీ, ప్రిన్సిపల్ మిశ్రా, స్కూల్ సిబ్బంది అభినందించారు.

సమావేశంలో పాల్గొన్న టిడిపి నేతలు రాజు, తాతయ్యబాబు

15న టిడిపి ర్యాలీ

ప్రజాశక్తి-చోడవరం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ఈనెల 15 నాటికి వంద రోజులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో ఆ రోజు చోడవరం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మల్లునాయుడు తెలిపారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలన ప్రజా వ్యతిరేకంగా మారిందన్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు పెద్ద ఎత్తున టిడిపిని ఆదరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా తయారైందని, నిరంకుశ పాలనతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.వెంకట సత్యనారాయణ, కనిశెట్టి సన్యాసిరావు, ఎలక మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు సంఘీభావం తెలపాలి

వడ్డాది : టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు చోడవరం కొత్తూరు జంక్షన్ నుండి వెంకన్నపాలెం వరకు పాదయాత్ర చేసి సంఘీభావం తెలుపుతున్నట్లు టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు తెలిపారు. శనివారం వడ్డాదిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఆందోళన

లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలకు డిమాండ్

ఆందోళన చేస్తున్న ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ చైర్మన్, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.ఫణీంద్ర కుమార్, వియ్యపు రాజు డిమాండ్ చేశారు. ఈ విషయంపై గత 20 రోజుల నుంచి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఆయా సంఘాల ఆధ్వర్యాన శనివారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెజ్లింగ్‌లో పతకాలు సాధించి భారత దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడడం దారుణమన్నారు. 20 రోజుల నుంచి ఢిల్లీలో మహిళా రెజ్లర్ల నిరసన చేపట్టినా ఇంతవరకూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. దేశ భక్తి గురించి గొంతు చించుకునే బిజెపి దేశ ప్రతిష్టను పెంచిన మహిళా రిజర్లపై ఈ విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా మోడీ స్పందించి బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దింపుదాం

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో జగన్ రెడ్డి పాలనలో అత్యంత నష్టపోయింది, అణచివేతకు గురైంది బీసీలేనని, బీసీల సత్తా చాటి జగన్‌ను గద్దె దింపుదామని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి పార్లమెంటు నియోజకవర్గ కార్యాలయంలో బీసీ సాధికార కమిటీ బీసీ సెల్ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, బీసీల కోసం ఖర్చు చేయాల్సిన రూ.75 వేల కోట్లను దారి మళ్లించి, ఆర్థికంగా అణగదొక్కారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కూడా రాజకీయంగా ఎదగాలన్న లక్ష్యంతో ఎన్టీఆర్, చంద్రబాబు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, జగన్ రెడ్డి ప్రభుత్వం 24 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పూతి కోటేశ్వరరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, గింజాల లక్ష్మణరావు, గుర్రం నూకరాజు, సబ్బి శ్రీనివాసరావు, మల్ల అప్పలరాజు, నక్క రాంబాబు, విల్లూరి రమణబాబు, దాడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారులు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి -అనకాపల్లి

పింఛనుదారులు ఇకెవైసి చేయించుకోవాలని అనకాపల్లి ఉప ఖజానాధికారి (పదమర) దొడ్డి రమణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం అనకాపల్లి శాఖ అధ్యక్షులు వడ్డాది జగన్నాధరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి సబ్ ట్రెజరీ కార్యాలయం (పదమర) పరిధిలో ఉన్న 2,739 మంది రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల్లో ఇప్పటి వరకు 1640 మంది ఈకెవైసీ చేయించుకున్నారని పేర్కొన్నారు. మిగిలిన 1099 మంది కూడా ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వెంటనే తమ కార్యాలయంలో గాని, పింఛనుదారులు హెచ్ఆర్ యాప్ ద్వారాగాని చేయించుకోవాలని సూచించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా ఉప ఖజానాధికారిని సంప్రదించాలని కోరారు.

కలశస్థాపన ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం

స్థానిక స్వయంభూ శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 4 నుండి 7వ తేదీ వరకు ఆలయ తూర్పు పశ్చిమ గాలిగోపురాల కలశస్థాపన జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.జయదేవ్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవ కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సహకారాలతో ఆలయం అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వం, దాతల సహాయ సహకారాలతో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. రెండవ కాణిపాకంగా పేరొందిన చోడవరం ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయటానికి భక్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నున్న నాగేశ్వరరావు, అర్చకులు కొడమంచిలి వెంకట్రావు, చలపతిరావు, కార్యనిర్వహణాధికారి ఎస్‌వి.సత్యనారాయణమూర్తి, ధర్మకర్తలు సువ్వాడ వెంకట విజయలక్ష్మి, జ్యోతుల శ్రీనివాస్, కొణతాల జయలక్ష్మి, కొండల గణపతి, మెడికల్ మూర్తి, పూసర్ల సుబ్బలక్ష్మి, బొడ్డు శ్రీరామ్మూర్తి, వడ్డాది నరసింహమూర్తి ప్రభృతులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జయదేవ్ తదితరులు

రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్

ప్రజాశక్తి-దేవరాపల్లి

జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిని పరిశీలన చేసిన అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. వైద్యాధికారి ఎస్.లలితతో మాట్లాడి పిహెచ్సీల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రక్తహీనత ఉన్న వారిని గుర్తించి ఆన్లైన్ డేటాలో నమోదు చేయడం జరుగుతుందని, వారికి ప్రతి నెల వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా 38 పీహెచ్సీలు మరమ్మతు పనులు చేపట్టామని, కొత్తగా ఏడు పిహెచ్సిల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 39 104 వాహనాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారని, వాటిలో పూర్తిస్థాయిలో మందులు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 377 మంజూరు కాగా, వాటిలో 10 పూర్తి స్థాయిలో ప్రారంభమైనట్లు వెల్లడించారు 143 జీవో ప్రకారం పిహెచ్సిల్లో 14 మంది సిబ్బందిని జూన్ నెలలోగా ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అన్ని పిహెచ్‌సిల్లో 170 రకాల మందులు అందుబాటులో ఉంచామని, 60 రకాల టెస్టులు చేయటానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఆసుపత్రి వద్ద రోగిని పరీక్షిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ హేమంత్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- కశింకోట

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 19న అనకాపల్లిలో చేయనున్న పర్యటన విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపు ఇచ్చారు. మండలంలోని తాళ్ళపాలెంలో కశింకోట మండలం టిడిపి కార్యకర్తలు సమావేశం శనివారం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు టిడిపి విజయానికి కృషి చేయాలన్నారు. చంద్రబాబు హయాంలో వివిధ రకాలుగా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళ్లిందని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పని చేసే వ్యక్తి చంద్రబాబు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కశింకోట మండల టిడిపి అధ్యక్షుడు కాయల మురళి, ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కలగా సోమేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రత్నాకర్, కళాశాల అధికారులు

'డైట్' బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ డైట్ బ్రోచర్-2023ను శనివారం ఆవిష్కరించారు. ఈ బ్రోచర్లో కాలేజీ విద్యార్థులు సాధించిన విజయాలు, అవార్డ్స్, ప్రాంగణ నియామకాలలో ఎంపికైన సమాచారం, కాలేజీ విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులు, కాలేజీని సందర్శించిన విశిష్ట అతిథుల ఫోటోలను పొందుపర్చినట్లు రత్నాకర్ తెలిపారు. ప్రతి విద్యార్థికి, వారి తల్లిదండ్రులకు కాలేజీ సమాచారం, ఆధునిక ఆవిష్కరణలు, నూతన కోర్స్ వివరాలు తెలుసుకొనుటకు దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా నర్సింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ కెఎస్.ఈశ్వరరావు, అకాడమిక్ డీన్ ఎ.కృష్ణ నాగ్, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ప్రజల ముంగిటికి ప్రభుత్వం పథకాలను అందజేస్తుందని చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం మండలంలోని చిన్నప్పన్నపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామస్తులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ కోవెల ఈశ్వరరావు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న టిడిపి నాయకులు నాగజగదీశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

శ్రీప్రజ్ఞ హర్యాక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీప్రజ్ఞ హర్యాక్ష 8వ జయంతి సందర్భంగా శనివారం అనకాపల్లి గవరపాలెం కొబ్బరితోటలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం ఓమిని ఆర్కే హాస్పిటల్ వైద్యులు స్త్రీలకు ప్రత్యేక వైద్య చికిత్సలు, జనరల్ పరీక్షలు చేశారు. 282 మందికి బ్లడ్ షుగర్, ఇసిజి, 2డి ఇకో కార్డియోగ్రఫీ, ఆక్సీజన్ సత్యూరేషన్, ప్రీ క్యాన్సర్ టెస్ట్ ఇన్ సర్విక్స్, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, దుమ్ముల పటుత్వ పరీక్షలు, పిల్లలకు 2 డైమన్షియల్ ఇకో కార్డియోగ్రఫీ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కుమార్ మల్టీ దంత వైద్యశాల వారు 140 మందికి దంత పరీక్షలు చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, విశాఖపట్నం రాజా కంటి ఆసుపత్రి సంయుక్త సౌజన్యంతో 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 40 మందికి కేటరాక్ట్ ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరికి 16న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి ఆపరేషన్ చేయనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు కొణతాల గోవింద అప్పలనాయుడు తెలిపారు. వీరిలో కళ్ళజోడు అవసరమైన వారికి 50 శాతం రాయితీపై రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి వద్ద కళ్లజోళ్ళు అందజేస్తామని చెప్పారు. ఇందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు వైద్య శిబిరంలో ఉచిత సేవలు అందించిన వైద్య సిబ్బందికి సాలువా కప్పి మెమొంటో అందజేసి సత్కరించారు.

మూలపేటలో...

మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో సోడదాసి శ్రీనివాస్ సామ్యూల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో డాక్టర్ దివ్య (నేత్ర వైద్యులు), డాక్టర్ భాస్కర్ (దంత వైద్యులు), డాక్టర్ శాంతి, సరోజినీ (జనరల్ వైద్యనిపుణులు), ఆనంద్, నాగలక్ష్మి (పారామెడికల్ ఆస్తమాలిక వైద్యులు) పాల్గొని 150 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కంటి చూపు మందగించిన పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగా అప్పలనాయుడు, గ్రామ రైతు సంఘం మాజీ అధ్యక్షులు ఎల్లపు నాయుడు, వార్డు మెంబర్ ఎల్లపు హైమావతి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధుల కోత

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కోశాధికారి నాయినబాబు

ప్రజాశక్తి- కె.కోటపాడు

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఈ ఏడాది బడ్జెట్లో భారీగా నిధులు కోత విధించిందని ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు అన్నారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో శనివారం ఉపాధి కూలీలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో మోడీ ప్రభుత్వం రాకముందు ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో లక్షా 20వేలు కోట్ల రూపాయలు నిధులు కేటాయించగా, మోడీ ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ నేడు రూ.60 వేల కోట్లకు కుదించిందని తెలిపారు. అందులో మెటీరియల్ కాంపౌండ్ అర్జీలు ఎక్కువగా ఉన్నాయని, అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు, ఆర్‌బికెలు, అంగన్వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లు, కాలువలు వంటి వాటికి ఖర్చు చేస్తుందని చెప్పారు. రోజువారి కూలి రూ.600 ఇవ్వాలని, 200 పని దినాలు కల్పించాలని, రెండు పూటల పనికి స్వస్తి పలికి పాత విధానాన్ని కొనసాగించాలని, పనిముట్లకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, ఉపాధి మెట్లు, కూలీలు పాల్గొన్నారు.

విఆర్‌పి నియామకంపై హైకోర్టును ఆశ్రయించిన సర్పంచ్

ప్రజాశక్తి -దేవరాపల్లి

మండలంలోని గిరిజన పంచాయితీ వాలాబులో ఉపాధి హామీ పథకం విఆర్‌పి నియామకం విషయంపై ఆ పంచాయతీ సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించారు. పంచాయతీ పాలకవర్గం రెండు సార్లు తీర్మానం చేసినా, అధికార యంత్రాంగం పట్టించుకోకుండా, కనీసం అర్హత లేని వ్యక్తిని నూతన విఆర్‌పిగా నియమించడంపై ఆ గ్రామ సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయమై సర్పంచ్ వెంకటలక్ష్మి శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌కు, మండల ఎంజిఎన్‌ఆర్‌జిఎస్ ఏపీవోకు, ఎంపీడీవోకు, పిడి డ్వామాకు హైకోర్టు ద్వారా నోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నివేదికను అందించాలని కోర్టు ఉత్తర్వులు పంపినట్లు ఆమె తెలిపారు. తమ గిరిజన పంచాయతీపై చిన్న చూపు చూసిన అధికారుల నుంచి తమకు, తమ పంచాయతీకి హైకోర్టు అండదండగా నిలిచి, కేసును నమోదు చేసినందుకుగాను ఆమె ధన్యవాదాలు తెలిపారు.

సర్పంచ్ వెంకటలక్ష్మి

ఎన్‌టిపిసి సింహాద్రిని సందర్శించి డైరెక్టర్

ప్రజాశక్తి-పరవాడ

ఎన్టీపీసీ సింహాద్రిని ఆ సంస్థ డైరెక్టర్ రమేష్ బాబు, ఆర్ఈడి దేబాశిష్ చటోపాధ్యాయ, ఈడి సి.శివకుమార్ శుక్రవారం సందర్శించారు. సింహాద్రి ప్లాంట్‌లోని స్టేజ్ -2 యాష్ వంటి వివిధ ప్రాంతాలను పరిశీలించారు. సైలో, స్టేజ్-1 ఎన్డీసిటి ప్రాంతాలు, స్టేజ్ -1 ఐడిసిటి యూనిట్-4, యుసిబి, ఇఎస్పి ప్రాంతాలు, సంకల్ప్ -2, ఎఫ్‌జిడి సైట్‌లో పనులను సమీక్షించారు. అనంతరం సింహాద్రి స్టేషన్ పనితీరు, ఇతర సమస్యలపై అధికారులతో సమీక్షించారు. తుప్పు నియంత్రణ, రక్షణపై వర్క్‌షాప్‌లో పాల్గొని వివిధ ప్రెజెంటేషన్ల సంకలనాన్ని విడుదల చేశారు. బాలిక సాధికారత మిషన్, సిఎస్ఆర్ ఫ్లాగ్‌షిప్‌ను రమేష్ బాబు, సంయుక్త మహిళా సమితి సీనియర్ సభ్యురాలు వాణి రమేష్ బాబు ప్రారంభించారు. యూనిఫారాలు, స్టేషనరీ, టాయిలెట్, ట్రాక్ సూట్లు, టీ-షర్టులు, పాదరక్షలు కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి బియుహెచ్ సంజయ్ కుమార్ సిన్హా సీనియర్ అధికారులు, జిఇఎమ్ పిల్లల తల్లిదండ్రులు, దీపికా లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాలికా సాధికారత మిషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

'వైసిపి పాలనలో బీసీలపై దాడులు'

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలోని వైసిపి పాలనలో బీసీలపై నిత్యం దాడులు జరుగుతున్నాయని తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర అన్నారు. స్థానిక లక్ష్మీదేవి పేటలో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే బీసీల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకువస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దొడ్డి రాము, దాడి జగన్, కొణతాల శ్రీనివాసరావు, కాండ్రేకుల ముకుంద, దొడ్డి జగ్గారావు, కొణతాల రాంబాబు, దొడ్డి శంకర్, కొణతాల నూకరాజు, భీమరశెట్టి త్రినాథ్ కుమార్, కోరుబిల్లి రమేష్, కొణతాల వాసు, కాళ్ల రాంప్రసాద్, బుద్ద శివాజీ, పిట్ల రాజు, కొండపల్లి వీరభద్రస్వామి, మత్తుర్తి మహేష్, కొయ్య నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిసి సాధికారత సమితి కన్వీనర్ సురేంద్ర

అన్నమయ్య పార్కులో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శారద బ్రిడ్జి వద్ద ఉన్న అన్నమయ్య పార్కులో తుప్పలను ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆప్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కొణతాల హరినాథబాబు మాట్లాడుతూ పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి పార్కును అందంగా తయారు చేయడానికి తమ పార్టీ అన్ని రకాల చర్యలు చేపడుతుందని చెప్పారు. సుమారు 15 ఏళ్లుగా ఈ పార్కులో అన్నమయ్య విగ్రహం తుప్పల మధ్యనే ఉందన్నారు. చక్కటి వాతావరణం చల్లదనంతో కూడిన అన్నమయ్య పార్కు పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేదతీరేందుకు తీర్చిదిద్దడం జరుగుతుందని చెప్పారు. కొన్ని రకాల బొమ్మలను తయారు చేసి పెట్టాలని ఆలోచన ఉందని, దీనికి అన్నమయ్య భక్తులు, అనకాపల్లి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు, బాబ్జి, కెవి.రమణ, సిహెచ్.అప్పారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల నుంచి.. ఆదివాసీలను రక్షించాలి

ర్యాలీ చేపడుతున్న సంఘం నేతలు

ప్రజాశక్తి-కొత్తకోట:వడ్డీ వ్యాపారుల నుంచి ఆదివాసీలను రక్షించాలని అఖిల భారత్ గ్రామీణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిఎస్ అజయ్‌కుమార్ కోరారు. శనివారం రావికమతం మండలం కొత్తకోటలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రావికమతం మండలంలోని అనేక గిరిజన గ్రామాలలో ఆదివాసీలు పెంచిన జీడి మామిడి తోటలను 99 సంవత్సరాల లీజు పేరుతో గిరిజనేతర వడ్డీ వ్యాపార వర్గాలు ఆక్రమించు కుంటున్నాయని, ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని వడ్డీలకు వడ్డీలు తప్పుడు లెక్కలు రాస్తూ చక్రవడ్డీలు కట్టి ఆ పేరుతో జీడి మామిడి సంపదను షావుకారులు దోచుకుపోతున్నారని ఆరోపించారు. 36 కుటుంబాలు ఉన్న రొచ్చపనుకు గ్రామం నేడు రెండు కోట్లకు పైగా అప్పులో మునిగిపోయి ఉందన్నారు. రెండు కోట్ల అప్పులకు వడ్డీ పేరుతో ఈ ఏడాది ఆ గ్రామంలో పండిన మొత్తం జీడిపంటను షావుకారులు దోచుకు పోయారన్నారు. వడ్డీ వ్యాపారుల కబంధహస్తాల నుండి ఆదివాసీలను బయటకు తీసుకురావాలని, 99 సంవత్సరాల లీజు ఎగ్రిమెంట్ పేరుతో ఆదివాసీల నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ బంజర పట్టాలు, అటవీ పట్టా భూములను తిరిగి ఆదివాసీలకు బేషరతు గా అప్పగించాలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అజయ్ కుమార్ గుర్తు చేశారు. ముందుగా కొత్తకోట మూడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లిలో ఐదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ మోసూరు రాజు ఆదివాసీలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసంఘటిత కార్మికుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎస్ గణేష్, మోసూరి రాజు పాల్గొన్నారు.

భూములు లీజులపై ఆందోళనకు రెవెన్యూ పోలీస్ అధికారులు స్పదించారు. శనివారం సాయంత్రం ఆ గ్రామాన్ని రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు, కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా బాధిత గిరిజనులు మాట్లాడుతూ, తీసుకున్న అప్పులు వడ్డీలతో పెరిగి అదే భూములను వ్యాపారులకు లీజుకు వ్రాసామని వివరించారు. వడ్డీలు కట్టలేని స్థితిలో తమ భూములు స్వాధీనం చేసుకోవడం తో ఫలసాయం తమకు అందటం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన అధికారులు సంబంధిత వ్యాపారులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ విభూషణరావు, ఆర్ఐ చినబ్బాయి పాల్గొన్నారు.

లంచ్ బాక్సుల పంపిణీ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు సారిపల్లివానిపాలెంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కాసింశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో లంచ్ బాక్సులు పంపిణీ చేశారు. కాసింశెట్టి కామేశ్వరరావు తన తాత, నానమ్మ కాసింశెట్టి రామారావు, సత్యవతి ల జ్ఞాపకార్థం విద్యార్థులకు లంచ్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డూరి శ్రీను, బాబులు, వెంకట అప్పారావు, నంది రామకృష్ణ, శీరం నరసింహమూర్తి, కాసింశెట్టి జోగినాధస్వామి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

బాక్సులు ఇస్తున్న కుటుంబ సభ్యులు

ఎండల్లో కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-గొలుగొండ:కొంకసింగి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో వేసవి దృష్ట్యా కూలీలకు పలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు పానీయాలు తాగాలని సూచించారు. అనంతరం ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఎఎన్ఎం

నేడు హనుమాన్ జయంతి

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో గాంధీ పార్కు వద్ద ఈనెల 14న హనుమాన్ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు రాఖీ శ్రీను తెలిపారు. ఉదయం నుండి పూజా కార్యక్రమాలతో పాటు సాయంత్రం కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

నక్కపల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- నక్కపల్లి :కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించడంతో ఆ పార్టీ నేతలు సంబరాల్లో మునిగారు. నక్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ నేత మేడేటి శంకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బాణాసంచా పేల్చారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఫలితాలు చూస్తే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, గోవింద్, అశోక్, చిరంజీవి, చక్రి సింహాద్రి, నాగేశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు. దేవవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నేత బి.ఏసు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సత్యనారాయణ, గణేష్, అప్పలకొండ, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌పై సంపూర్ణ విశ్వాసం

నర్సీపట్నంటౌన్:కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలపై కర్ణాటక ప్రజలు సంపూర్ణ విశ్వాసం ఉంచారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు, నర్సీపట్నం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మీసాల సుబ్బన్న అన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలపై శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీపై పూర్తి నమ్మకం ఉంచారన్నారు. ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తమకు సంపూర్ణ మద్దతును ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడోయాత్ర అన్ని వర్గాల ప్రజల మద్దతు కూడగట్టడానికి తోడ్పడిందన్నారు. కర్ణాటక ప్రజలు భారతీయ జనతా పార్టీని పూర్తిగా తిరస్కరించారన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై పూర్తి నమ్మకం ఉంచిన కర్ణాటక ప్రజలకు, పార్టీ గెలుపును తన భుజ స్కందాలపై వేసుకున్న కర్ణాటక కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంపై స్థానిక పార్టీ నాయకులు శనివారం గంట స్తంభం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు, పిసిసి సభ్యులు తెడ్డు రామదాసు మాట్లాడుతూ, కేంద్రం బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతే ప్రస్తుత ఫలితాలకు నిదర్శనమన్నారు. కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రాహుల్ గాందీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మకాయల పైడిరాజు, కె.సన్యాసిరావు, వి.ఎల్లారావు, శేఖర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపుపై హర్షం

పెందుర్తి : కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టడంపై ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ షేక్ షఫీ ఉల్లా హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షఫీ ఉల్లా మాట్లాడుతూ, కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం బిజెపి పతనానికి నాంది పలుకుతుందన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడోయాత్రను ప్రజలు స్వాగతించారని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో కూడా అధికారంలోకి తెస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పెందుర్తి నియోజవర్గ అధ్యక్షులు ఆడారి రమేష్ నాయుడు, కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు వెనకోట రాము, బిఎస్.నాయుడు, కొమ్మాది లక్ష్మాజి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : కర్ణాటక రాష్ట్రం శాసనసభ ఎన్నికలలో అత్యధికంగా 136 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా శనివారం కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ పతనం కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయంతో మొదలైందని తెలిపారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రభావం కర్ణాటక ఎన్నికలపై స్పష్టంగా కనిపించిందన్నారు. కర్ణాటకలో విజయం స్ఫూర్తితో రాబోయే రోజులలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా అవతరించడం తథ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కెఎస్‌ఏ రామయ్యానాయుడు, కాళ్ళ సత్యనారాయణ, కత్తెర శ్రీధర్, సేనాపతి రాజు, కెవి.మాణిక్యం, ఆర్‌ఆర్ నాయుడు, వాయిబోయిన రాజు, బాల మురళి పాల్గొన్నారు.

భీమిలిలో కేక్ తినిపిస్తున్న నాయకులు

సర్టిఫికెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే గణేష్

క్రీడాకారులకు ఎమ్మెల్యే గణేష్ అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: అనకాపల్లి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు శనివారం క్రీడా సామగ్రిని అందజేశారు. నర్సీపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చేతుల మీదుగా క్రీడాకారులకు వీటిని అందజేశారు. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆర్చరీ, బాక్సింగ్, తైక్వాండో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ తదితర ఆరు క్రీడలలో వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు క్రీడా అధికారి నగిరెడ్డి సూర్యారావు వీటిని సమకూర్చారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. ఈ నెలలో తిరుపతిలో జరిగిన సీఎం కప్ సీనియర్ బాక్సింగ్ పోటీలలో బంగారు పతకాలు గెలుచుకున్న మహిళా బాక్సర్లు బొంతు మౌనిక, కొలుకుల కృష్ణవేణి లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్లు లగుడు శ్రీనివాస్, వెలగ జగన్నాథం, వూషఉ కోచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

తరగతుల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-మాడుగుల:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత పరిష్కారం లభించిందని మాడుగుల ఎంపిపి పెదబాబు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇన్నాళ్లు జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహించారని, డిగ్రీ కళాశాల భవనానికి ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు కృషితో ఐదు ఎకరాలు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. సాంకేతిక కారణాల జాప్యంతో ప్రస్తుత డిగ్రీ కళాశాలను మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిర్మించిన బాలికల వసతి గృహంలో వద్దకు కళాశాలను మారిపించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు.ఇకపై ప్రస్తుతం ఇంటర్మీడియట్ కళాశాల ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు, ఇదే మాదిరిగా డిగ్రీ కళాశాల ఇదే సమయంలో తరగతులు కొనసాగుతాయని తెలిపారు. దీనికి కారణమైన ఉప ముఖ్యమంత్రి బూ డి ముత్యాల నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల కమిటీ చైర్మన్ శ్రీనాథ శ్రీనివాసరావు సైతం కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, ఎంపీటీసీ విజయలక్ష్మి వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:ఐసిడిఎస్‌లో రిజర్వేషన్ కేటగిరీకి సంబంధించి ఎస్సీ, ఎస్టీల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఎం అప్పలరాజు కోరారు. ఈ మేరకు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేయడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. రిజర్వేషన్లకు సంబంధించిన పోస్టుల విషయంలో జాప్యం చేయకుండా భర్తీ చేయాల్సిందిగా కోరారు.

వినతిపత్రం ఇస్తు్న అప్పలరాజు

క్రాఫ్ట్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఉత్సాహంగా పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ జోగేశ్వరరావు ముందుగా పేపర్ క్రాఫ్ట్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పేపర్‌తో తయారు చేసిన పుష్పగుచ్ఛం, ఫోటో ఫ్రేమ్, పువ్వులు స్టాండ్ కళాకృతులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమం లో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి జనార్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సచివాలయ వార్డు కార్యదర్శి నూకరాజు, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

ములగాడ : విద్యార్థులు సామాజిక చైతన్య విషయాలపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా కళారూపాలుగా వాటిని తయారుచేసి ప్రదర్శించాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి సూచించారు. మల్కాపురంలోని పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో శనివారం ఆమె మాట్లాడుతూ, స్వచ్ఛభారత్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మంచి అలవాట్లు, ఆరోగ్యవంతమైన జీవన విధానం, అక్షరాస్యత ఆవశ్యకత తదితర అనేక అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రముఖ కవి కె.సత్తిరాజు మాట్లాడుతూ, కులమతాలకతీతంగా వెళ్లే ఆలయం గ్రంథాలయమన్నారు. పాత్రికేయులు మనోహర్ మాట్లాడారు. కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయ పరిచారు.

పెచ్చులు ఊడిన పై కప్పు

శిథిలావస్థలో పశువైద్యశాల

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని పాముల వాకపశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 25 సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులూడి సిబ్బంది, రైతుపై పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పశువైద్యశాలకు సంబంధించి విలువైన సామగ్రి, మందులు పశుదానా వంటివి వర్షం కురిసే సమయంలో తడిచి పోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఆసుపత్రి భవనానికి మెయిన్ గేటు లేక పోవడంతో పలు సందర్భాల్లో అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నవని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

దెబ్బతిన్న బేసిన్

ఇష్టారాజ్యంగా మాంసం దుకాణాలు

-కానరాని లైసెన్సులు
-తనిఖీలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీలో మాంసం, చేపల దుకాణాలు ఇష్టారాజ్యంగా ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. మునిసిపాలిటీ అధికారులు, శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఇవి వెలుస్తున్నాయి. పట్టణంలో సిపిఎం కాంపౌండ్, ఇందిరా మార్కెట్, డిగ్రీ కళాశాల, పెదబొడ్డేపల్లి సెంటర్లోనూ ఇలా తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేశారు.వీటిలో చాలా షాపులు అనాధికారికంగా ఉన్నవే. చేపల నిల్వ కేంద్రంలో మాంసం నిల్వ కేంద్రాలు ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. పట్టణం, బలిఘట్టం, పెద్ద బొడ్డేపల్లి, వేములపూడి తదితర ప్రాంతాల్లో సుమారు 200 చేపలు, మాంసం దుకాణాలు ఉన్నప్పటికీ మున్సిపాలిటీ అధికారులు లైసెన్స్ ఇచ్చిన షాపులు కేవలం 10 నుండి 12 మాత్రమే ఉన్నాయి. వీటికి సంవత్సరం పొడుగునా మాంసం అమ్ముకుంటే సంవత్సరానికి 500 వరకు పన్నులు చెల్లిస్తారు. కొన్ని దుకాణాల్లో మృతజీవాల మాంసాన్ని అమ్ముతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దుకాణాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలపై దృష్టి సారించాల్సిన మున్సిపాలిటీ అధికారులు వాటి వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. పెద్ద బొడ్డేపల్లి, డిగ్రీ కళాశాల ప్రాంతాలలో రోడ్డు పక్కనే దుకాణాలు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రేగిన దుమ్ము మాంసంలో కలుస్తోంది. పొట్టేలు, మేకపోతు తదితర జీవాల మాంసం కొందరు దుకాణదారులు ఫ్రిజ్లో పెట్టి విక్రయిస్తుండడం పరిపాటిగా మారింది. వీటిని వెటర్నరీ అధికారి, శానిటేషన్ సిబ్బంది గాని గుర్తించిన దాఖలాలు లేవు. ముఖ్యంగా ఇలాంటి మాంసాన్ని కొన్ని హోటళ్లకు తక్కువ ధరకే ఇస్తుండటంతో వంటకాల్లో మసాలాతో కలిపి వండివార్చుతున్నారు. వీటిని ఆరగించిన భోజనప్రియులు రోగాలను కొని తెచ్చుకుంటున్న సందర్భాలు లేకపోలేదని డాక్టర్లు చెపుతున్నారు. కొన్నిప్రాంతాల్లో చనిపోతున్న కోళ్ల మాంసాన్ని అమ్మకాలు జరుపుతున్నారు. చికెన్‌పకోడి దుకాణాలు, బిర్యానీ పాయింట్లు నర్సీపట్నంలో పుట్టగొడుగుల్లా వెలిసాయి. దుకాణాలు ఎన్ని ఉన్నా ఫుడ్ లైసెన్సు పొందినవి ఎక్కడా కనిపించవు.

నిబంధనల ప్రకారం మాంసం దుకాణదారులు మేకలను, గొర్రెలను, తదితర జీవాలను కొనేటప్పుడు సంబంధిత అధికారి జంతువు ఆరోగ్యంగా ఉందా, లేదా అని పరిశీలించి ముద్ర వేయాలి. మున్సిపాలిటీలో పశు వైద్యులు, మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది తనిఖీ చేయాలి. నర్సీపట్నంలో ఇవేవీ ఉండవు. అధికారులు, సిబ్బంది తనిఖీలు అటకెక్కాయి. నాసిరకం మాంసం విక్రయాలు అరికట్టాల్సిన ఆహార భద్రత నియంత్రణ అధికారులు కొన్ని ముఖ్యపట్టణాలకే పరిమితమవుతుండటంతో కనీస తనిఖీలు కూడా చేయలేని దుస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు మాంసం విక్రయాలు, దుకాణాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నర్సీపట్నంలో కబేళాను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీన్ని ఏర్పాటు చేస్తే అనాధికారిక దుకాణాలు, మృత జీవాలను అమ్మే అవకాశం ఉండదు. మున్సిపాలిటీకి ఆదాయంతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పలువురు తెలిపారు.

పరిశీలిస్తున్నాం

మున్సిపాలిటీలో అనధికారిక దుకాణాలను తాము పరిశీలిస్తున్నాం. నిల్వ మాసం, చేపల ఉన్నట్లయితే వెంటనే షాపులు మూయిస్తున్నాం. నర్సీపట్నంలో కబేళా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీన్ని ఏర్పాటు చేస్తే విచ్చలవిడిగా అమ్మకాలు జరిగే అవకాశం ఉండదు.

చిట్టిబాబు
శానిటేషన్ ఇన్స్పెక్టర్

నేటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

-ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ - పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి -పాడేరు,పాడేరుటౌన్:మోదకొండమ్మ పండగకు అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణం ముస్తాబైంది. రాష్ట్ర గిరిజన జాతరగా పేరొందిన పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, ఆలయ కమిటీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, కార్యదర్శి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వర్తన పిన్నయ్యదొర, ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి సుబ్బారావు, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. మోదకొండమ్మ ఉత్సవాలు ఈనెల 14, 15, 16 మూడు రోజులపాటు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు మారుమూల గిరిజన గూడెల్లోని ప్రజలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బలగాలను, 1,400 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులూ పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నేడు శతకంపట్టులో మొదకొండమ్మ

ఉత్సవాల్లో తొలి రోజైన ఆదివారం వేకువ జామున మోదకొండమ్మ ఆలయం నుంచి శతకంపట్టు వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్ఠించడంతో మూడు రోజుల ఉత్సవాలు మొదలవుతాయి. తొలి రోజు అమ్మవారిని శతకంపట్టు వద్ద కొలువు తీర్చే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, బాణసంచా కాల్పులు, గిరిజన నృత్యాల నడుమ ఈ కార్యక్రమం జరగనుంది. ఆలయ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, పాడేరు సర్పంచి ఉషారాణి తదితరులు ఊరేగింపులో పాల్గొననున్నారు. మూడో రోజు మంగళవారం తిరిగి ఆలయంలో చేర్చడం(అనుకోత్సవం)తో ఉత్సవాలు ముగుస్తాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పట్టణ వీధుల్లో ఊరేగింపు జరుగుతుంది.

ఉత్సవాల్లో ప్రభుత్వ స్టాళ్లు ఏర్పాటు..

మూడు రోజుల మోదకొండమ్మ ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లతో పాటు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యక్రమాలు, పథకాలపై ప్రజల్లో అవగాహనకు అధికారులు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై సమాచార శాఖ ఆధ్వర్యంలో ఫోటో ప్రదర్శన, జిసిసి, వ్యవసాయ, ఉద్యానవన, కాఫీ, ఐసిడిఎస్, వెలుగు శాఖల కార్యక్రమాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేస్తారు.

మెరిసిపోతున్న పాడేరు

ఉత్సవాల సందర్భంగా పాడేరు పట్టణం విద్యుద్దీపకాంతులతో మెరిసిపోతోంది. సుమారు 40 లక్షలతో పట్టణమంతా సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలు అలంకరించారు. రహదారులన్నీ విద్యుద్ధి పాలంకరణతో కళకళలాడుతున్నాయి. విద్యుద్ది పాలంకరణలతో చూడముచ్చటగా ఉండేలా లైటింగ్ సెట్టింగులు చేస్తున్నారు. పట్టణంలోని ఆయా చోట్ల ప్రతిమలతో కూడిన లైటింగ్, మెయిన్ రోడ్డుకు, ఆలయానికి వెళ్లే మార్గంలో ఇరువైపులా ఎల్ఇడి బోర్డులు, పట్టణంలోని మెయిన్ రోడ్డు పైన పలు రంగులతో కూడిన సీరియల్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలు రాత్రి సమయంలో ఆకర్షణీయంగా కనిపించేలా లైటింగ్ సెట్టింగులు చేశారు. ఆలయానికి సంప్రదాయంగా ముస్తాబు చేయగా, తొలి రోజు అమ్మవారిని కొలువు తీర్చే సంతకం పట్టు పందిరిని సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయాన్ని, మోదమ్మ మూలవిరాట్ విగ్రహాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, అమ్మవారి ఘటాలను ఊరేగింపునకు సిద్ధం చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

ఈ ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు వినోదం అందించేందుకు

ఏర్పాటు చేసిన భారీ సెట్టింగు

నిర్వాహకులు పట్టణంలోని పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాల వస్తువుల విక్రయాలతో పాటు పిల్లల వినోద కార్యక్రమాలతో ఉల్లాసంగా ఉంటుంది. ఈ మూడు రోజులు సినీ, టీవీ కళాకారులతో ప్రదర్శనలు, ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు. మూడో రోజు అనుపు ఉత్సవం రోజున మంగళవారం జరిగే ఊరేగింపు కనువిందుగా నిర్వహించేందుకు వివిధ రకాల వేషధారణలు, నృత్యాలు, ప్రదర్శనలతో పాటు భారీ స్థాయిలో బాణసంచాను కాల్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు

ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల మూడు రోజులపాటు వాహన రద్దీ నియంత్రించేందుకు ట్రాఫిక్‌ను వివిధ మార్గాల్లో మళ్లించారు. పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట నుంచి జి.మాడుగుల, చోడవరం వైపు వెళ్లాల్సిన వాహనాలు అడారిమెట్ట, అడ్డుమండ మీదుగా వంతాడపల్లి చెక్ గేట్ కు చేరుకుని వెళ్లాల్సి ఉంటుంది. చింతపల్లి, జి.మాడుగుల నుంచి అరకులోయ, చోడవరం వైపునకు వెళ్లాల్సిన వాహనాలు లగిసపల్లి -నక్కలపుట్టు మీదుగా వంతాడపల్లి చెక్ గేట్ కు చేరుకుని వెళ్లాల్సి ఉంటుంది.చోడవరం, వడ్డాది, మాడుగుల నుంచి అరకులోయ, పెదబయలుకు వంతాడపల్లి అడ్డుమండ మీదుగా వెళ్లాలి.